ప్రజాశక్తి
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024
5
విశాఖపట్నం
అనకాపల్లి





2024 ఎన్నికల్లో మహిళా మ్యానిఫెస్టో

◆ రాష్ట్రంలో ప్రధాన పార్టీలను డిమాండ్ చేసిన ఐద్వా ◆ మోడీ, జగన్‌వి ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలు
◆ మద్యం, గంజాయి, డ్రగ్స్‌ను ప్రోత్సహించే పాలకులపై మహిళలు ఉద్యమించాలి ◆ విశాఖ నగరంలో మహిళల భారీ ప్రదర్శన, బహిరంగ సభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మహిళలపై హింస లేని విధానం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, చౌక ధరల దుకాణాల ద్వారా ఐదు రకాల నిత్యావసర సరుకుల పంపిణీ వంటి అంశాలతో కూడిన మ్యానిఫెస్టోతో 2024 ఎన్నికల్లో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ముందుకు రావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆయా పార్టీలను డిమాండ్ చేసింది. రానున్న కాలం అత్యంత సవాళ్లతో కూడుకున్నదని, మహిళలు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని, ప్రభుత్వాల హింసపై పోరాడాల్సి ఉందని సంఘం జాతీయ కార్యదర్శి మరియం థావలే పిలుపునిచ్చారు. ఈ నెల 25 వరకూ విశాఖలో జరగనున్న ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలను పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం నగరంలోని సరస్వతీ పార్కు నుంచి జివిఎంసి సెంట్రల్ పార్కు వరకూ మహిళల భారీ ప్రదర్శన జరిగింది. వందలాది మంది పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఐద్వా జాతీయ, రాష్ట్ర నాయకులు చేసిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మోడీ మనువాద రాజ్యంలో స్త్రీలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాదం, మనువాదంతో దేశ సమైక్యతపై బిజెపి దాడి చేస్తోందన్నారు. ఈ విచ్ఛిన్న పోకడలకు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం సహకరించడాన్ని తప్పుబట్టారు. మద్యం, గంజాయి, డ్రగ్స్‌ను ప్రోత్సహించేలా పాలక విధానాలున్నాయన్నారు. మహిళలు, పిల్లలపై హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయన్నారు. సారా దుకాణాలపై దాడులు, సారా ప్యాకెట్ల ధ్వంసం చేసే క్రియాశీలక కార్యక్రమాల్లో విశాఖలో మహిళలు పాల్గొనడాన్ని వారు గుర్తుచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళల సొమ్ము సుమారు రూ.18 వేల కోట్లను బ్యాంకుల నుంచి పథకాలకు మళ్లించేసి సంక్షేమం అంటున్నారని రమాదేవి ఎద్దేవా చేశారు. ధరల భారం దేశంలో ప్రజలపై పడి ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. మహిళా హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని సభకు అధ్యక్షత వహించిన ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ అన్నారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలను సాధించే పోరాటాల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఐద్వా కీలక పాత్ర పోషించిందన్నారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు, మానభంగాలు, హత్యలకు పాల్పడే వారికి మోడీ ప్రభుత్వం సన్మానాలు చేయడం దారుణమన్నారు. ఈ చర్యలను రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన కనీస స్థాయిలో ఖండించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో జగన్ కార్పొరేట్ విధానాలపై మహిళలు పోరాడాలన్నారు. స్కీం వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు పనికొచ్చే సదుపాయాలపై దృష్టిసారించడం లేదన్నారు. ధరలను పెంచడం, పన్నుల భారం మోపడం వంటి వాటిని బహుమానంగా ఇస్తున్నాయంటూ ఎద్దేవా చేశారు. సరస్వతి పార్కు నుంచి సెంట్రల్ పార్కు వరకూ జరిగిన భారీ మహిళా ప్రదర్శన అగ్రభాగాన మరియం థావలే, ఎస్.పుణ్యవతి, ప్రభావతి, రమాదేవి, వై.సత్యవతి, పద్మ, డాక్టర్ జి.ప్రియాంక, విమల ఉన్నారు. వేల సంఖ్యలో మహిళలు, సిఐటియు నాయకులు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యకర్తలు ప్రదర్శనలో పాల్గొన్నారు. డప్పులు, మహిళల కోలాటాలతో సందడి వాతావరణం కనిపించింది. ప్రజానాట్యమండలి కళాకారుల గీతాలు చైతన్యపరిచాయి.


బహిరంగ సభలో మాట్లాడుతున్న పుణ్యవతి, వేదికపై మరియం థావలే తదితరులు


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



నగరంలో సాగుతున్న ఐద్వా ర్యాలీ


కోలాటంతో ఆకట్టుకున్న మహిళలు


అబ్బురపరిచిన హెలీకాప్టర్ల విన్యాసాలు, మిగ్‌ల కాంతులు

మిలాన్.. అదిరెన్

◆ ఆకట్టుకున్న నేవీ విన్యాసాలు ◆ తీరంలో సందడే సందడి
◆ మారిటైం సెమినార్‌లో సందేశమిచ్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తూర్పు నావికాదళం ఆధ్వర్యాన విశాఖ వేదికగా జరుగుతున్న మిలాన్ ప్రధాన వేడుక గురువారం ఘనంగా సాగింది. తొలుత ఇంటర్నేషనల్ మారిటైమ్ సెమినార్‌ను భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ప్రారంభించి మాట్లాడారు. భారతదేశ సముద్ర చరిత్రలో తూర్పు నావికాదళానిదే కీలకపాత్ర అని ప్రశంసించారు. సముద్రాల గొప్పతనాన్ని వివరించారు. ఆ సెమినార్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, చీఫ్ ఆఫ్ నావెల్ స్టాప్ అడ్మిరల్ ఆర్.హరికుమార్, కమాండింగ్ ఆఫీసర్ రాజేష్ పెంధార్కర్‌లతోపాటు 12 దేశాలకు చెందిన నావికాదళ ప్రతినిధులు పాల్గొన్నారు. సాయంత్రం ఆర్‌కె.బీచ్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ సిటీ పెరేడ్‌కు ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ, పర్యాటక శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ హాజరయ్యారు. ఆయనకు ఘన స్వాగతం లభించింది. విన్యాసాల్లో భాగంగా హాక్ విమానాలు, చేతక్ హెలికాప్టర్ల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. తేజస్ విమానాలతో చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 205 మంది నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కలర్స్ అఫ్ లైఫ్ నృత్య ప్రదర్శనకు పలువురి మెప్పు లభించింది. ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య విద్యుత్ దీపాలంకరణలతో మెరిసిపోయాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంప్రదాయ నృత్యాలైన గరగలు, కూచిపూడి, థింసా, కొమ్ముకోయ, తప్పెటగుళ్లు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున నవరత్నాలు, స్మార్ట్ సిటీ శకటాలను ప్రదర్శించారు. వేడుకల్లో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, మేయర్ హరివెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.


విన్యాసాలను తిలకిస్తున్న వేలాది మంది ప్రజలు

కెజిబివి వార్షికోత్సవం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని కింతాడ శివారు గొల్లలపాలెంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఇఒ-1 కూనిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డు చిన్నమ్ములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పల్ల కన్నమ్మ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఒమ్మి భూలోక, గొల్లలపాలెం గ్రామ పెద్దలు పల్ల రాజేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిర్బంధం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : దగా డీఎస్సీ వద్దు.. మెగా డిఎస్సీ ముద్దు అంటూ ఎపి సచివాలయం ముట్టడికి ఎపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ఇచ్చిన పిలుపు మేరకు బయలుదేరిన కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు తనకాల అనంతరావును, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎల్లపు రామును పోలీసులు నిర్బంధించారు. పోలీసుల చర్యలను కాంగ్రెస్ నాయకులు అనంతరావు, రాము తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి హిట్లర్ కన్నా పెద్ద నియంతలా ఉన్నారని, ప్రశ్నించే గొంతులను నొక్కి వేస్తున్నారని పేర్కొన్నారు.

'సెయింట్ జాన్స్'లో స్కౌట్ అండ్ గైడ్ దినోత్సవం

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో గురువారం భారత్ స్కౌట్ అండ్ గైడ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాబర్ట్ బైడన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గైడ్ కమిషనర్ ఆర్.ఉమా, అసిస్టెంట్ కమిషనర్ వి.నళిని, జిసిహెచ్ నాగేశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపనంద, షాజిదా, అకడమిక్ ఇన్‌ఛార్జి చంద్రమౌళి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం హైస్కూల్లో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన ఎనీమియా, రక్తహీనతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ విద్యార్థులకు మాత్రలు మింగించారు ఈ కార్యక్రమం నిర్వహించారు వైద్య సిబ్బంది ఎంఎస్‌వి ప్రసాద్, అన్నమ్మ, నరసింహరావు, ఆర్‌వివి సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి సుమన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్‌ఒలు ఐక్య పోరాటాలు చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పోరాటాలతోనే డిమాండ్లు పరిష్కారమవుతాయని, విఆర్‌ఒలందరూ ఐక్యతగా పోరాటాల్లో పాల్గొవాలని ఎపి విఆర్‌ఒల సంఘం ప్రధాన కార్యదర్శి అనంతరామయ్య పిలుపునిచ్చారు. అచ్చుతాపురంలో గురువారం వీఆర్వోల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షులు రామ కాసు, నాయకులు ఆర్‌సిహెచ్ నాయుడు, ఏ.శశిధర్, పాలివేల వెంకటరావు, శ్రీను, కిరణ్, చిన అప్పారావు, జగన్, నాయుడు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా గురువారం ఇరువాడ పంచాయితీలోని కృపా సహాయక కేంద్రంలో 30 మంది నిరు పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పి.విజయ్ కుమార్, ప్రేమనాథం, ఎస్ నిర్మల, పి.సత్యహవిలా గ్రేస్, యస్ దివ్యతేజ, యస్.నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం పంగిడి గ్రామానికి చెందిన చీపురుపల్లి చిన్నమ్ములు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో కసింకోట మండలం కన్నూరుపాలెం గ్రామానికి చెందిన పది రూపాయలు సేవా సంస్థ నిర్వాహకులు అర్జున్ రెడ్డి గురువారం నిత్యవసరాలు, రూ.5వేలు నగదు అందజేశారు. ప్రతినెల బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని అర్జున్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్ పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు అమానుషం

బిజెపి ప్రభుత్వ ఘాతుకంపై రైతులు, కూలీల నిరసన


దేవరాపల్లిలో నిరసన తెలుపుతున్న వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న, రైతులు, కూలీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కావాలని కోరడమే నేరమన్నట్లు హర్యానా ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపి, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రక్తసిక్తం చేయడంపై ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన గురువారం దేవరాపల్లిలో రైతులు, కూలీలు నిరసన తెలిపారు. రైతులపై బిజెపి ప్రభుత్వం కాల్పులు జరపడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న మాట్లాడుతూ రైతులను దేశానికి శత్రువుల్లా చూస్తూ వారిని అడ్డుకోవడానికి అడుగడుగునా సిమెంటు బారికేడ్లు, ఇనుప ముళ్ల కంచెలు బిజెపి ప్రభుత్వం పెట్టిందని తెలిపారు. అయినా వెనక్కి తగ్గకుండా చావో రేవో తేల్చుకుంటామని, కనీస మద్దతు ధర చట్టం తెచ్చే వరకు పోరాటం సాగిస్తామంటూ రైతులు బారికేడ్లను, కంచెలను తోసుకుని ముందుకు వెళ్లే ప్రయత్నం చేయగా, హర్యానా పోలీసులు రబ్బర్ బులెట్లు, టియర్ గ్యాస్ ఫిరంగులతో తీవ్ర స్థాయిలో రైతులపై విరుచుకుపడ్డారని పేర్కొన్నారు. ఈ ఘటనలో పంజాబ్ రాష్ట్రం, భటిండా జిల్లా బాలాక్ గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువ రైతు శుభ కరణ్ సింగ్ చనిపోయారని, 25 మంది రైతులకు గాయాలయ్యాయని తెలిపారు. హర్యానా ప్రభుత్వ దాష్టీకానికి ఇంతకు ముందు ఇద్దరు రైతులు బలయ్యారన్నారు. రైతుల పట్ల మోడీ ప్రభుత్వ దుర్మా ర్గానికి ఇదొక నిదర్శనమన్నారు.

నక్కపల్లి : ఢిల్లీలో రైతులపై పోలీసులు జరిపిన కాల్పులు హేయమైన చర్య అని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు అన్నారు. గురువారం ఆయన స్థానిక రైతులతో కలిసి మాట్లాడారు. పంటలకు మద్దతు ధరలు, నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన పోరాటానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో పోలీసులతో రైతులపై దాడి చేయించడం దుర్మార్గమన్నారు. రైతుల ఉద్యమం పట్ల నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో దోనివాని లక్ష్మీపురం మాజీ ఎమ్‌పిటీసి గింజాల వెంకటరమణ, గరికిన చిట్టిబాబు, కిల్లాడ సింహాచలం, కిల్లాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'యలమంచిలి అభివృద్ధికి వైసిపి కట్టుబడి ఉంది'


మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి రాజా

ప్రజాశక్తి - యలమంచిలి : ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా యలమంచిలి ప్రాంత అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా) అన్నారు. జాతీయ రహదారి గుండా యలమంచిలి పట్టణంలోకి నిర్మించిన రైల్ ఓవర్ బ్రిడ్జిని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి చిరునామాగా మారిన వైసీపీ ప్రభుత్వానికి మరోమారు అవకాశం కల్పిస్తే అన్ని విధాల ప్రజల అవసరాలు తీర్చడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ రూ.35 కోట్ల అంచనా వ్యయంతో 2009లో తన హయాంలో 70 శాతం పూర్తయిన బ్రిడ్జి పనులు తరువాత టిడిపి ప్రభుత్వంలో నిలిచిపోయాయని, తిరిగి తామే పూర్తి చేశామని చెప్పారు. బ్రిడ్జి పనులు పూర్తి కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ యలమంచిలి మీదుగా వెళ్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, ఎంపిపి బోదెపు గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, వైస్ ఎంపిపి రాజాన శేషు, జడ్పీటిసీ సంధ్యారాము, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, రాజాన మహలక్ష్మి, కొల్లి త్రినాథ్, దాసరి కుమార్, మళ్ల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం

సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని సబ్బవరం మండలంలో అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ పిఒ వి.లలిత కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం పంచాయితీ గణపతిపురంలో మినీ అంగన్వాడీ వర్కర్ (ఒసి), అంతకాపల్లి పంచాయితీ రావలమ్మపాలెం-2 (ఒసి), నారపాడు పంచాయితీ బలిజపాలెం (ఒసి), వంగలి పంచాయితీ వంగలి-2(ఎస్‌సి), తవ్వావానిపాలెం -2 (ఎస్‌సి), అమృతపురం-2 (ఎస్.సి), సూరెడ్డిపాలెం (ఒ.సి), టెక్కలిపాలెం పంచాయితీ నాయనమ్మ పాలెం (ఒసి) తదితర కేటగిరీలో ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత పొంది, 21 నుండి 35 సంవత్సరాల వయస్సు ఉన్న వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 23 నుండి 29 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

కె.కోటపాడు : కె.కోటపాడు మండలం పొడుగుపాలెం, దేవరాపల్లి మండలం ఎస్ఆర్ చేనులపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు ఏపీఓ డి.మంగతాయారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పిపి అగ్రహారం-2, నేతవానిపాలెం, ఎం.భూపతిపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని రావికమతం ఐసిడిఎస్ పీవో ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జగన్ ఇసుక దందాలకు కలెక్టర్ల సహకారం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ ఇసుక దందాకు కలెక్టర్ల సహకారం ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని కేంద్ర ప్రభుత్వం పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ హైకోర్టుకు నివేదిక ఇచ్చిందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాల ఫొటోలు, నకిలీ బిల్లు పుస్తకాలు తదితర ఆధారాలను కమిటీ సేకరించిందని, దీనిపై ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుకలో దోచుకున్న డబ్బుతో రానున్న ఎన్నికల్లో గెలవాలని జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నారన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, ఏపీఎం సత్యనారాయణ, గుడాల సత్యనారాయణ, శంకర్ల పద్మలత పాల్గొన్నారు.

నూకాంబిక హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారి దేవస్థానం హుండీని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, అనకాపల్లి జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, ధర్మకర్తల పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. 2024 నవంబర్ 25 నుంచి ఈనెల 22 వరకు 90 రోజులలో హుండీ ద్వారా రూ.26,64,970 నగదు, 20 గ్రాముల 200 మిల్లీ గ్రాముల బంగారం, 1 కేజీ 98 గ్రాముల వెండి వచ్చింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఉత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేట అంజయ్య కాలనీలో శ్రీమరిడిమాంబ అమ్మవారి ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పలువురు నేతలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వైసిపి నాయకులు మందపాటి జానకిరామ రాజు, జాజుల రమేష్, భోగలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, ఉగ్గిన అప్పారావు, కోన ఉమా, పేఖూరి కళ్యాణ్, డొంక సత్తిబాబు, టిడిపి నాయకులు మల్ల సురేంద్ర, పాల్గొన్నారు.

డైట్‌లో కవలల దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాలలో కవలల దినోత్సవం (ట్విన్స్ డే) గురువారం కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్స్ డే, ఫాదర్స్ డే లాగా ట్విన్స్‌కు ప్రత్యేక రోజు ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు ఒకే రూపు రేఖలు కలిగి ఉన్న విద్యార్థులకు ట్విన్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బుద్ధ కృష్ణకు డిప్యూటీ ఇఇగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఏపీఈపీడీసీఎల్ అచ్యుతాపురం ఎఈఈగా పనిచేస్తున్న బుద్ధ కృష్ణ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా ఉద్యోగోన్నతిపై విశాఖపట్నం కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. కృష్ణకు ఉద్యోగోన్నతిపై సర్పంచులు, ఎంపీటీసీ అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు 120 మందికి కోసూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కోసూరు రవిశంకర్ తన సొంత నిధులతో పరీక్ష అట్టలు (ఎగ్జామ్ ప్యాడ్స్)ను గురువారం పంపిణీ చేశారు. వీటిని ఎంఇఒ బి.పడాల్‌దాస్, ఎంఈఓ-2 వి.ఉషారాణి, జెసిఎస్ మండల కన్వీనర్ కెవి.రమణ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కోరుపోలు శ్రీను, డ్రాయింగ్ మాస్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు.

శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -మునగపాక : స్థానిక సంత బయలులో శ్రీకృష్ణ బాలల యువజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ద్విచక్రవాహనాలు

ఇబ్బందుల్లో పాదచారులు

ప్రజాశక్తి-సీతమ్మధార : శంకరమఠం రోడ్డులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో రోడ్డుపై పాదచారులు నడవలేని పరిస్థితి ఉంది. ఫుట్‌పాత్‌పై వెళ్దామంటే ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేసి ఉంచుతున్నారు. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జివిఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చొరవ చూపి ఫుట్‌పాత్‌పై వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని పాదచారులు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసిన వాహనాలు

ఉత్సవ కరపత్రం విడుదల

ప్రజాశక్తి-భీమునిపట్నం : స్థానిక నూకాలమ్మ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన గురువారం విడుదల చేశారు. ఏప్రిల్ 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పీరుపిల్లి రాజు, కోశాధికారి రాకోతు నరసింగరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగిరెడ్డి వెంకట స్వామి, కో-ఆర్డినేటర్ అప్పికొండ బాలకృష్ణ, ప్రముఖులు గంటా నూకరాజు, అల్లిపిల్లి నరసింగరావు, కె.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



87వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధిలో రూ.50.72 లక్షలతో పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వార్డులో మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక నిధులు కేటాయించినట్లు తెలిపారు. వార్డులో పెండింగ్ పనులకు టెండర్లు పిలిచి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, తిరుమలనగర్‌లో రూ.18 లక్షలతో సిసి డ్రెయిన్లు, కల్వర్టులు, సత్యానగర్ మహాత్మాగాంధీ పార్కులో సుమారు రూ.15 లక్షలతో పిల్లల ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్, తిరుమలనగర్‌లో సుమారు రూ.10 లక్షలతో పిల్లల ఆట పరికరాలు, ప్రహరీ, తిరుమలనగర్‌లోని అమరావతి పార్కు, వాకర్స్ పార్కు, మదర్ థెరిసాపార్క్ లో రూ.7.12 లక్షలతో వీధి దీపాలు, పలు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, కోమటి శ్రీనివాస్, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొడ్డ సూరిబాబు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 48వ వార్డు ఇందిరానగర్ -2, 3లో రూ.32.66లక్షలతో సామాజికభవనం, ఓపెన్ జిమ్ తదితర అభివృద్ధి పనులకు వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, వార్డు నాయకులు కుమార్ బెనర్జీ, శంకరరావు, రాజుబాయ్, కోటేశ్వరరావు, రాజు, పద్మ, హేమంత్, జూన్సన్, భూలోక, కనక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసకు మద్యం ప్రధాన పాత్ర

ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి

ప్రజాశక్తి -సీతమ్మధార : మహిళలపై హింస పెరగటంలో మద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి ఆరోపించారు. మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పిఒడబ్ల్యు అర్ధ శతాబ్ది వార్షికోత్సవంలో భాగంగా గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ, మద్యం, గంజాయి, డ్రగ్స్ వల్ల మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి అత్యాచారాలు పెరుగుతున్న స్థితి ఉందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం పాలన కొనసాగిస్తామని అధికారాన్ని చేపట్టిన ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మద్యాన్ని పెంచుతూ ఆదాయం వనరుగా చేసుకుంటుందని ఆరోపించారు. ప్రజల బలహీనతలపై ప్రభుత్వాలు ఆదాయాల సంకూర్చుకుంటున్నాయన్నారు. దేశంలో మద్యం అమ్మకాల్లో, రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. మద్యం మత్తులో సంభవిస్తున్న మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్‌పై వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలన్నింటినీ ప్రశ్నించాలన్నారు. సిఐఎంఎస్ లలిత మాట్లాడుతూ, రామ జపాన్ని ముందుకు తెచ్చి, లౌకిక ఉద్యమాన్ని దెబ్బతీయాలని కేంద్రం చూస్తుందని ఆరోపించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు విమల మాట్లాడుతూ, దోచుకుంటున్న ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు గూడూరు సీతామహాలక్ష్మి, అనురాధ, నిర్మల, గిరిధర్, ఎం.వెంకటేశ్వర్లు, ఈసర లక్ష్మి, శ్రీనివాస్, డాక్టర్ సీతల్, కృష్ణారావు, చిన్నారావు తదితరులు పాల్గొని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలని తీర్మానించారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ జనార్ధనరావు కోరారు. స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధనరావు మాట్లాడుతూ, ప్రలోభాలకు లొంగకుండా ఓటును స్వేచ్ఛగా వినియోగించుకుంటే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన శాసన, కార్య నిర్వాహక వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే పాలకుల ఆలోచనా సరళి మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ఓటరు నిజాయితీగా ఓటు వేయాలని కోరారు. ఓంకారేశ్వర ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యాన బార్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ మురళీకృష్ణ, ఎపిజివిబి బ్రాంచి మేనేజర్ జయంతి వేద ప్రభాస్, సామాజిక కార్యకర్త కంటుభుక్త శ్రీనివాసరావు, ఆయుర్వేద వైద్యులు సత్తరవు వయునందనరావు, ఓంకారేశ్వర ఆధ్యాత్మిక సేవా సంఘం అధ్యక్షులు పల్లా భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధనరావు

'బొడ్డేపల్లి రాజగోపాల్ సేవలు ఎనలేనివి'



రాజగోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి -మాధవధార : కళింగుల అభ్యున్నతికి కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు చేసిన సేవలు ఎనలేనివని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహనరావు కొనియాడారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు వర్ధంతి సందర్భంగా మాధవధారలోని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పప్పల రామ్మోహనరావు మాట్లాడుతూ, ఎంపీగా ఆరుసార్లు గెలుపొంది, ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖారవేల అసోసియేషన్ కార్యదర్శి పొందూరు సూర్యనారాయణ, అఖిలభారత కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మూల వెంకట్రావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీనివాసరావు, పప్పల రామచంద్రావు, పొన్నాడ అప్పారావు, పాత్రుని మల్లేశ్వరరావు, కె.చలమయ్య, ఎం.అచ్యుతరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరాల కార్పొరేషన్ చైర్మన్‌గా పోతిన బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా విజయవాడ గొల్లపూడిలో ఉన్న ఛాంబర్‌లో పోతిన శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోతిన శ్రీనివాసరావు, సతీమణి లక్ష్మి పరమేశ్వరిలను నగరాల కుల సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం పోతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ, నగరాల సామాజిక వర్గ సభ్యులందరినీ కలుసుకొని, సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.

విష ప్రచారాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి -సీతమ్మధార : ఎల్లో మీడియాతో జతకట్టిన పార్టీలు చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలని సోషల్ మీడియా ఐటి విభాగానికి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సోషల్ మీడియా ఐటి విభాగంతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధితో ఆంధ్ర రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తుంటే ఓర్వలేక అన్ని పార్టీలు ఒకటై ఎల్లో మీడియాతో జత కట్టి లేనిపోని ఆరోపణలు చేస్తూ విష ప్రచారం చేస్తున్నాయన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో జగన్ చేస్తున్న మంచిని ప్రజలకు తెలిసేలా అందరూ పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ఐటి విభాగం ఉపాధ్యక్షుడు సూర్య, సోషల్ మీడియా కో - కన్వీనర్ సదరం జ్యోసెఫ్, ఉత్తర నియోజకవర్గం సోషల్ మీడియా కో - కన్వీనర్ డానియల్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

బిసిజి టీకాలు వేసేందుకు సర్వే

ప్రజాశక్తి -మధురవాడ : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఆధ్వర్యాన బిసిజి వ్యాక్సిన్ వేసేందుకు పాత టీబీ రోగులకు సంబంధించి సర్వే నిర్వహించారు. మధురవాడ టిబి యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం ఆధ్వర్యాన సచివాలయ ఎఎన్ఎంలు సర్వే చేశారు. 18 సంవత్సరాలు పైబడి సుగర్ ఉన్న వారికి, 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ, 18 సంవత్సరాలు పైబడి 2018 నుంచి 2022 మధ్య టీబీ మందులు వాడిన వారికి, 2021 నుంచి 2023 మధ్య టీబీ రోగులు ఉన్న ఇళ్లలోని 18 సంవత్సరాలు పైబడిన వారికి, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవారికి, పొగాకు ఉత్పత్తులు వాడేవారు బిసిజి టీకాకు అర్హులని డాక్టర్ పూర్ణేంద్రబాబు తెలిపారు.

జనసేన పల్లె యాత్ర

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని అయినాడు గ్రామపంచాయతీలో గురువారం జనసేన పల్లె యాత్ర కార్యక్రమాన్ని పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల ప్రారంభించారు. ముందుగా గ్రామంలో ఉన్న రాజ్యలక్ష్మి అమ్మవారు, సత్యనారాయణపురంలోని శిరిడి సాయిబాబా ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అయినాడ, సత్యనారాయణపురం, బొత్సపేట, బి.తాళ్లవలస, లింగన్నపేట, బుడ్డివలస, కొయ్యిపేట, నేరెళ్లవలస, చిన్నపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భీమిలిలో జెట్టీ, మూలకుద్దులో షిప్‌యార్డు ఏర్పాటుచేస్తామని గత ఎన్నికల ముందు ముత్తంశెట్టి శ్రీనివాసరావు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇవేమీ అమలుకు నోచుకోలేదన్నారు. పద్మనాభంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, తాగునీరు సరిగా లేదని ఆరోపించారు. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే ఇప్పటివరకు ఉన్న పథకాలను కొనసాగిస్తూ కొత్తగా మరిన్ని అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కె.రామస్వామినాయుడు, కె.రమణ, కె.నగేష్‌కుమార్, కె.లీలావతి, జె.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర లాయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-లీగల్ : నవ్యాంధ్ర లాయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్య నిర్వాహకవర్గాన్ని గురువారం జిల్లా కోర్టులోని న్యాయవాదుల ఆడిటోరియంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఫౌండర్ కొయ్య హరిహర్‌రెడ్డి అధ్యక్షులుగా, బగాది తులసీదాస్ ప్రధాన కార్యదర్శిగా, అప్పలనాయుడు ఉపాధ్యక్షులుగా, గాయల్ రామిరెడ్డి జాయింట్ సెక్రెటరీగా, జివిఎల్ కుమార్ కోశాధికారిగా, 9 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా, పైడి గోవిందరావు గౌరవాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గానికి పలువు న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యవర్గం మూడేళ్లు కొనసాగుతుంది.



ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న న్యాయవాదులు

కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ బలిఘట్టంలో మున్సిపల్ కార్మికుడిగా పని చేస్తున్న ముత్యాల అప్పారావు కేన్సర్‌తో బాధపడుతున్నాడు. అపరేషన్ చేయించుకునేందుకు ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) గురువారం అప్పారావుకు రూ.10వేలు అర్థిక సహాయం చేసారు. నిత్యావసర సరుకులు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, యూనియన్ ప్రెసిడెంట్ బోర్రా శ్రీనువాసరావు, అర్జమ్మ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు 21 వేల బుట్టల మంజూరు

ప్రజాశక్తి-మాకవరపాలెం:గ్రామాల్లో చెత్త సేకరణకు బుట్టలను అందజేస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపిడిఒ జాన్‌లింకన్ తెలిపారు. స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా మండలానికి 21వేల చెత్త బుట్టలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని మండలంలోని 31 పంచాయతీల్లో ప్రజలకు పంపిణీ చేసేందుకు గాను మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆటోలపై తరలించామన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

ప్రజాశక్తి-మాకవరపాలెం:కాంగ్రెస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని మండల పార్టీ అధ్యక్షులు బొంతు రమణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్.షర్మిల తలపెట్టిన దగా డిఎస్సీ ఛలో సెక్రటరియేట్ ముట్టడి కార్యక్రమంలో షర్మిలతో పాటు మాజీ పీసీసీ అధ్యక్షులు రుద్రరాజు తదితర నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో అణుకు గిరిజన గ్రామమైన ప్రాంతానికి రోడ్డు ఏర్పాటుకు 38 లక్షలు మంజూరు కావడంతో గురువారం పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నగేష్ బాబు రోడ్డు ఏర్పాటు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన గ్రామమైన అణుకు ప్రాంతానికి సుమారు 4.8 కిలోమీటర్ల రోడ్డు ఫార్మేషన్ పనులు జరుగుతున్నాయని, ఉపాధి హామీ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.గిరిజనులకు రాకపోకలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ కుమార్ రాజా, జూనియర్ ఇంజనీర్ వర్మ పాల్గొన్నారు

కాగా గ్రామానికి రోడ్డు ఏర్పాటు పనులు సిపిఎం పోరాటం ఫలితంగా మంజూరు అయిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మశ్రీకి సీటు ఇస్తే సహకరించం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:ఎమ్మెల్యే ధర్మశ్రీకి సీటు ఇస్తే సహకరించేది లేదని పలువురు వైసిపి నేతలు తేల్చి చెప్పారు. మండలంలోని పెద్ద మదినలో వైసీపీ ముఖ్య నాయకులు గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, జెండా మోసి పార్టీ కష్టాల్లో ఉంటే ఒడుదుడుకులు ఎదుర్కొని ఇబ్బందులను అధిగమించి అధికారంలోకి తీసుకువస్తే ఎమ్మెల్యే ధర్మ శ్రీ కనీసం ఫోన్ కూడా ఎత్తరని పలువురు ప్రజా ప్రతినిధులు ఫైరయ్యారు. గత ఎన్నికల్లో కొంతమంది ఓడిపోవడానికి కారకులైన వారిని ప్రాధాన్యత నిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెలు సత్యనారాయణ, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కొలిమల్ల అచ్చంనాయుడు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, పెద్ద మదిన సర్పంచ్ కె.వి.ఆర్ నాయుడు, వడ్డాది సర్పంచ్ దాడి సూరి నాగేశ్వరరావు, కోరుకొండ సూరప్పారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొంప వెంకటేశ్వరరాజు, సర్పంచ్‌లు గోకివాడ వరకిష్ణ, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు..



హాజరైన నాయకులు

బాక్సింగ్‌లో రాజేశ్వరికి కాంస్య పతకం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 13 నుండి 20 వరకు బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్ణాటకలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌కి నర్సీపట్నం నింజాస్ అకాడమీ నుండి నలుగురు బాక్సర్లు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో యూత్ విభాగంలో బొమ్మల రాజేశ్వరి 50 కేజీల మహిళా విభాగంలో బ్రాంజ్ మెడల్(కాంస్యం) సాధించింది.

వాలంటీర్లకు అవార్డులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ రత్నం, ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరయ్యారు. వాలంటీర్లకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జడ్పిటిసి కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, సర్పంచ్ జయ రత్నకుమారి, నాయకులు సూరకాసుల గోవింద్, చంద్రరావు, తాతారావు, శేషారత్నం పాల్గొన్నారు.



నక్కపల్లిలో సత్కరిస్తున్న నాయకులు

కోటవురట్ల:మండలంలోని కైలాసపట్నం గ్రామంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన బాధ్యతలు చేపట్టడంలో వాలంటీర్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూకరత్నం, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ రమణ పాల్గొన్నారు.

రావికమతం:గత మూడు ఏళ్ల నుంచి వరుసగా మూడు సార్లు సేవారత్న పురస్కారానికి మండలంలో గర్నికం సచివాలయ వాలంటీర్ వంశీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ, సేవా దృక్పథంతో పని చేయాలన్న ఉద్దేశంతో వాలంటీర్‌గా చేరానన్నారు. ప్రభుత్వం తనకు వరుసగా మూడుసార్లు సేవా రత్న పురస్కారం అందించిందన్నారు. దీంతో తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

గొలుగొండ:రావణాపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కిలపర్తి పెద్దిరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, కొమిరా సర్పంచ్ అల్లు రాజుబాబు, మాజీ పీఎసిఎస్ అధ్యక్షులు కొల్లు అప్పలనాయుడు, కొల్లు రాము పాల్గొన్నారు.

ఏటిగైరంపేటలో జరిగిన వాలంటీర్లకు సత్కారంలో జిల్లా బీసీ సెల్ సెక్రెటరి పాము చినఅప్పలనాయుడు, జిల్లా వైసీపీ యువజన విభాగం జాయింట్ సెక్రెటరీ సుర్ల రమ, స్కూల్ కమిటీ చైర్మన్ సింగంపల్లి సూరిబాబు, మాజీ ఉప సర్పంచ్ రాజాన కృష్ణ, నాయకులు పాల్గొన్నారు. కసిమి పంచాయతీలో సర్పంచ్ ఈర్లె శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ కిరణ్, వైస్ సర్పంచ్ ఫకీర్ పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో వాలంటీర్‌కు వందనం కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సేవా వజ్రా, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వాలంటీర్లను ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పెంట కోట జ్యోతి శ్రీనివాసరావు, ఎంపిడిఓ శేషు బాబు, వైసిపి మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, నమ్మి గణేష్, ఈఓఎస్ రమేష్ పాల్గొన్నారు.

తగరపువలస : వాలంటీర్లు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం లక్ష్మీపురంలో గురువారం మండలంలోని 13 గ్రామ సచివాలయాలు, జివిఎంసి నాలుగో వార్డుకు చెందిన 6 వార్డు సచివాలయాలకు చెందిన 323 మంది వాలంటీర్లను సత్కరించారు. వీరిలో ఇద్దరు సేవా వజ్ర, ఐదుగురు సేవా రత్న, 316 మంది సేవా మిత్రకు ఎంపికయ్యారు. సర్పంచ్ ఎల్.జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి డివిఎస్ఎస్ఎన్.రాజు, వైస్ ఎంపిపి బోని బంగారు నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎండిఓ డాక్టర్ వి.జానకి, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

అనంతరం రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు.

సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయాలి

ప్రజాశక్తి-రోలుగుంట:దళిత వాడల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం రోలుగుంట మండల కేంద్రంలో కెవిపిఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, డప్పు, చర్మ కళాకారులందరికీ గుర్తింపు కార్డులు, రూ.5వేల పింఛన్లు ఇవ్వాలన్నారు. డప్పు కళాకారులకు డప్పులు, బట్టలు, గజ్జలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో డప్పు కళాకారులకు అవకాశం ఇవ్వాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రద్దు అయిన పథకాలను తిరిగి ప్రారంభించాలన్నారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

వీధిలైట్లకు స్విచ్ బోర్డ్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని రత్నంపేట పంచాయతీ పనసలపాడు గ్రామంలో వీధిలైట్లకు స్విచ్ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. గ్రామంలో 50 మంది భగత ఆదివాసి గిరిజనులు నివాసం ఉంటున్నారన్నారు. విద్యుత్ స్తంభాలకు స్విచ్ బోర్డు లేక పోవడంతో రాత్రి సమయాల్లో వీధి లైట్లు వెలిగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్విచ్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.



పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

మెగా డిఎస్‌సి ప్రకటించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్రంలో మెగా డిఎస్సీని ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మేడేటి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ఎలక్షన్ ముందు తక్కువ పోస్టులతో డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగుల జీవితాలతో సిఎం జగన్ ఆటలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ ప్రకటించాలని పిసిసి అధ్యక్షురాలు షర్మిల ఆందోళనకు పిలుపునిస్తే ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు.రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ప్రగడ చక్రరావు, నాయకులు బుజ్జి పాల్గొన్నారు.

ఎస్ఐగా గఫూర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి ఎస్ఐగా గఫూర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. నక్కపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించిన విభూషణరావు ఎస్.రాయవరం బదిలీ అయ్యారు. శ్రీకాకుళం నుండి బదిలీపై గఫూర్ నక్కపల్లి స్టేషన్‌కు వచ్చారు.అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా, శాంతి భద్రతకు విఘాతం కలగకుండా విధులు నిర్వహిస్తానన్నారు.

ఘనంగా బండిమాంబ పండగ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో గొట్టువాడ గ్రామంలో గురువారం బండిమాంబ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పెద్ద సంఖ్యలో గ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పథకాలపై అవగాహన

ప్రజాశక్తి -చీడికాడ:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై మండలంలోని చిన గోగాడ గ్రామంలో స్వచ్ఛంద సంస్థ హక్ దర్శక్ కంపెనీ, డిబిఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ కామిరెడ్డి మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి 18 రకాల చేతివృత్తుల దారులు అర్హులన్నారు.సైబర్ నేరాలు, ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డి ఏజెంట్ కే.వెంకట గంగారత్నం పాల్గొన్నారు.

ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అప్రమత్తంగా బాధ్యతలు నిర్వహించాలని నర్సీపట్నం డిఎస్పీ వెంకటరామయ్య సూచించారు. గురువారం పోలీసు అధికారులు, సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయని, వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల పోలింగ్ బూతుల పరిశీలన, బాక్సులు స్టాక్ రూమ్‌కి చేరేంత వరకు ఎంతో కీలకమైన బాధ్యతలు ఉంటాయన్నారు. ఎన్నికల విధుల్లో తప్పులు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ కాంతికుమార్, రూరల్ సిఐ హరి, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి

IN THE HON'BLE COURT OF THE CHIEF METROPOLITAN MAGISTRATE AT: VISAKHAPATNAM D.V.C.45/2020

Between:
Konari Aruna Kumari @ Surya Kumari . . . Petitioner
And:
Konari Appala Ravi and another ...Respondents

NOTICE

To,
R-1: Konari Appala Ravi, S/o. Late Rama Rao, Retired Police Department, R/at D.No.10-11-43, Nehru Nagar, Visakhapatnam.
R-2: Manga, Husband name not known to the petitioner, R/at D.No.10-11-43, Nehru Nagar, Visakhapatnam.

Please take notice that the above-named petitioner has instituted the above D.V.C. against both of you and the matter stands posted to **01-03-2024** for your appearance. You both are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **01-03-2024 at 10:30 A.M in the** above Court, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
P.G. BHAVANI,
Advocate
Visakhapatnam.
Cell:9491897487.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన లేటు తాడిపత్రి వెంకట రామనాథస్వామి తరపున జగ్గాస గనేశ్వరరావు (ఫోన్ నెం. 08913145646), తండ్రి వెంకటరావు సంయుక్తంగా దిగువ ఆస్థిని అభివృద్ధి చేయుటకై నిర్ణయించుకున్నారు. సదరు ఆస్థి విక్రేత అయినటువంటి తాడిపత్రి వెంకట రామనాథస్వామి యొక్క, డాక్యుమెంట్ నెం. 513/1943, 537/1943, 505/1943, సర్వేనెం. 61, య. 5.77 సెంట్లు, సర్వేనెం. 62, య. 15.96 సెంట్లు, ఖాతా నెం. 20000603 గల ఖాళీ స్థలంన్నా మాకు వారసత్వం ద్వారా సంక్రమించినటువంటి ఆస్తి, కావున దిగువ తెలిపిన ఆస్థిపైన ఎవరికైనను ఏమైనా ఆసక్తి లేదా క్లయిమ్ లేదా అభ్యంతరములు ఉన్నచో వాటిని లిఖిత పూర్వకంగా డాక్యుమెంటరీ రుజువులతో ఈ ప్రకటన తేదిను 15 దినములలోగా తెలియపరచవలెను. అట్లు చేయనిచో దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్థిపైన ఎలాంటి క్లయిములు లేదా అభ్యంతరములు లేవని పరిగణించబడుతుంది. మరియు నా క్లయింట్ షెడ్యూలులో తెలిపిన ఆస్తి క్రయ విక్రయాలకు సిద్ధమవుదురు.

షెడ్యూలు : విశాఖపట్నం జిల్లా, ఋషికొండ, డాక్యుమెంట్ నెం. 513/1943, 537/1943, 505/1943, సర్వేనెం. 61, యం. 5.77 సెంట్లు, సర్వేనెం. 62, య. 15.96 సెంట్లు, ఖాతా నెం. 20000603 విస్తీర్ణము గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు :
తూర్పు : సముద్రం దక్షిణం : కొండ
పడమర : 80 ఫీట్ రోడ్డు
ఉత్తరం : ఇతరుల ఖాళీ స్థలం

P.SRINIVASA RAO, Advocate,
D.No. 49-19-1, Lalitha Nagar,
Visakhapatnam-16.Ph: 2563329

కార్మికులకు చేదోడుగా యూనియన్లు పనిచేయాలి

ప్రజాశక్తి -ములగాడ : కార్మికులకు చేదోడు వాదోడుగా ట్రేడ్ యూనియన్ పనిచేయాలని ఎఐటియుసి గౌరవాధ్యక్షులు జెవి.సత్యనారాయణమూర్తి సూచించారు. గురువారం ఏర్పాటుచేసిన కోరమండల్ గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలుచేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కంపెనీలో ప్రమాదం జరిగితే ఇఎస్ఐకి కాంట్రాక్టర్, యాజమాన్యం వెంటనే తెలియపరచాలని, కాంట్రాక్ట్ కార్మికుల్లో సీనియర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఇటీవల మృతిచెందిన కార్మికుడు ప్రసంగి శంకరరావు కుటుంబానికి సహాయం చేయాలని డిమాండ్‌చేశారు. క్యాంటీన్ సౌకర్యం మెరుగు పరచాలని, లేబర్ యాక్ట్ ప్రకారం స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ జీతాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, మహాలక్ష్మి, కె.శంకర్, కె.సత్యనారాయణరెడ్డి, ప్రకాష్, జి.రాంబాబు, శ్రీను, శేఖర్, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకులను పట్టించుకోరా?

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవ సమీపంలో మంచినీటిని నిలవ చేసే ట్యాంకులు మరమ్మతులకు నోచుకోలేదని జనసేన నాయకులు గల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడి నుంచి ఎంతోమందికి తాగు నీరు సరఫరా అవుతుందని, ఇటువంటి మంచినీటి ట్యాంకులకు కనీసం రంగులు వేయలేరా ప్రశ్నించారు. ప్రజా ఆరోగ్యం అధికారులకు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -గాజువాక : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రాజీవ్ నగర్‌కు చెందిన సైయ సమీరాకు జెఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జాగారపు శ్రీను తన మిత్రులతో కలిసి రూ.33,200 ఆర్థిక సహాయం, నిత్యవసర వస్తువులు అందజేశారు.

ఎల్‌జి వాష్ టవర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ తమ నూతన ఉత్పత్తి ఎల్‌జి వాష్ టవర్‌ను శంకరమఠం రోడ్డులోని సంస్థ షోరూమ్‌లో మేనేజింగ్ డైరెక్టర్ హుంగు జూ జీయున్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ఉత్పత్తి లాండ్రీరంగంలో సరికొత్త విప్లవాత్మక మార్పులను తీసుకొస్తుందన్నారు. ఈ వాషింగ్ మిషన్ కేవలం ఒక గంటలోనే బట్టలను శుభ్రం చేసి డ్రై చేస్తుందన్నారు. బట్టల తీరును బట్టి ఆటోమేటిక్‌గా ప్రోగ్రాం మార్పు చేసుకుంటుందని తెలిపారు. దీని విలువ రూ.2,75,000గా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రీజినల్ హెడ్ కృష్ణాజీ, బ్రాంచ్ మేనేజర్ యుగంధర్, బ్రాండ్ షాప్ హెడ్ తరుణ్ భరద్వాజ్, డీలర్ సందీప్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కాంగ్రెస్ నేత

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ నుంచి చలో అమరావతి సచివాలయం కార్యక్రమానికి బయలుదేరిన పిసిసి సభ్యుడు వైఎస్.జగన్నాథరావును పోలీసులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఉదయం ఏడు గంటలకు నోటీస్ ఇచ్చి ద్వారకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈయనతో పాటు మరి కొంతమంది స్థానిక నాయకులను అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం వరకు స్టేషన్‌లో నుంచి అనంతరం విడిచిపెట్టారు.

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార: జివిఎంసి 43వ వార్డు పరిధి వెంకటేశ్వరకాలనీ ప్రాంతంలో రూ.57.70 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ సమక్షంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అధికారులు సురాబత్తుల తిరుపతి, బైరా వెంకట్, బాధ శ్రీనివాస్, సిర్రా లక్ష్మణ్, కంచు పద్మశేఖర్, మట్టా రాణి, బంగారమ్మ, కోలా లక్ష్మి, కుమారి, జక్కంపూడి సత్తిబాబు, ఎం.గోపి, నేతల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూలో బ్యాటరీ సైకిళ్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో సందర్శకుల కోసం సదరన్ గ్రూప్ ద్వారా నూతన టెక్నాలజీతో కూడిన బ్యాటరీ సైకిళ్లను జూక్యూరేటర్‌తో కలిసి చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథరెడ్డి గురువారం ప్రారంభించారు. జూ మెయిన్ గేటు, సాగర్ గేట్ వద్ద ఈ సైకిళ్లు సందర్శకులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గంటకు రూ.70 అద్దె ప్రాతిపదికన అందించనున్నట్లు వివరించారు.



మెరుగైన పనితీరు కనబరిచిన వారికి పురస్కారం అందజేస్తున్న డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

ఘనంగా రైల్వే వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం 68వ రైల్వే వారోత్సవాలు - రైల్ సేవా పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ రైల్వేలోని ప్రతి యూనిట్ పనితీరును సమీక్షించేందుకు, రైల్వే అధికారులు, సిబ్బంది పని చేసి సాధించిన అసాధారణ ఫలితాలు గుర్తించేందుకు రైల్వే సేవా పురస్కార వేడుకలు అవకాశం కల్పిస్తున్నాయని అన్నారు. రైల్వేల ప్రగతిశీల వృద్ధికి విలువైన సహకారం అందించినందుకు రైల్వే సిబ్బందిని ఆయన అభినందించారు. అత్యుత్తమ పనితీరు కనబరిచిన 64 మంది సిబ్బందికి మెరిట్ అవార్డులు, వివిధ విభాగాలకు రెండు గ్రూప్ అవార్డులు, 12 మందికి షీల్డ్‌లు అందజేశారు. అనంతరం వేదిక వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజం మొహంతి, మంజుశ్రీ ప్రసాద్, ఎడిఆర్‌ఎం (ఇన్ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, ఎడిఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, కవితా గుప్తా, మధు స్మిత సాహూ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసనలు

తమ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ టిడిపి, వైసిపి కార్యకర్తలు విశాఖ నగరంలో గురువారం వేర్వేరుగా నిరసనలకు దిగారు. ఒకరిపై మరొకరు కత్తులు దూసుకున్నారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబు, లోకేష్‌లపై రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో గురువారం సెవెన్ హిల్స్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. అమర్‌నాథ్ చిత్రపటాన్ని కోడిగుడ్లతో కొట్టి పెద్దపెట్టున నినాదాలు చేశారు. పరిశ్రమల శాఖ మంత్రిగా అమర్‌నాథ్ ఎన్ని పరిశ్రమలు తీసుకువచ్చారో చెప్పాలని, తీసుకువచ్చిన పరిశ్రమల వద్ద నించొని సెల్ఫీ తీసుకొని పెట్టాలని డిమాండ్ చేశారు. ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.రతన్‌కాంత్, నాయకులు బొండా రవికుమార్, పీలా అవినాష్, బొత్స ప్రవీణ్, డెక్కా ఈశ్వర్ పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన..

వైసిపి విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం రామ్‌నగర్ సెవెన్ హిల్స్ జంక్షన్‌లో ఉన్న ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద నారా లోకేష్‌కు పప్పు అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్దేశించి ఇటీవల నగరానికి వచ్చిన లోకేష్ టిడిపి కార్యకర్తల సమావేశాల సందర్భంగా చేసిన ఆరోపణలను ఖండిస్తూ వైసిపి యువజన విభాగం కార్యకర్తలు వినూత్న రీతిలో ఇలా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు కృపా జ్యోతి, నాయకులు బోని శివరామకృష్ణ, మింటి మహేష్, జీలకర్ర నాగేంద్ర, రామన్నపాత్రుడు పాల్గొన్నారు.

జగన్ హయాంలో ముస్లిములకు అన్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముస్లిములకు ఎంతో అన్యాయం చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.నజీర్ ఆరోపించారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కడంలో మాస్టర్ డిగ్రీ తీసుకున్నారన్నారు. బటన్ నొక్కుతూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వంలో కంటే షాధీ తోఫా తాము ఎక్కువ ఇచ్చామని జగన్ అబద్ధాలు చెప్పడం దారుణమన్నారు. సమావేశంలో అబ్దుల్ చిన్న రెహమాన్, అబ్దుల్ అనిఫ్, జఫరుల్లా, సలీం పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి అప్రజాస్వామికం

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : అనంతపురం జిల్లా రాప్తాడులో విధినిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులోని ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల దాడిని నిరసిస్తూ తగరపువలస జంక్షన్‌లో గురువారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 'జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి', 'పత్రికా స్వేచ్ఛను కాపాడండి', 'విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మానవహారం నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.రంగదామారావు, స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు డిజె.మోహన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.గణపతిరావు, భీమిలి, తగరపువలస, ఆనందపురం, పద్మనాభం మండలాల జర్నలిస్టులు కెఆర్.మోహనరావు, రాము, సూర్యనారాయణ, ఆకుల త్రిమూర్తులు, అప్పలరాజు, ఎ.రోజా, దొంతల చిన్నశ్రీను, రౌతు నాగరాజు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం భీమిలి ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ రామస్వామికి, తహశీల్దార్ టి.గోవింద్‌కు వినతి పత్రాలు అందజేశారు

ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై దాడులు పజాస్వామ్యానికే ప్రమాదమని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్టా సురేష్ పేర్కొన్నారు. ఈ దాడులను ఆయన ఖండించారు.

ఆదివాసీ గిరిజన సంఘం ర్యాలీ

పాడేరు: విలేకరులపై దాడులను ఖండిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయం నుంచి పాత బస్ స్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పాత్రికేయులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బాలదేవ్ మాట్లాడుతూ, ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను దారి మళ్లించడానికి విలేకర్లపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. విధ్వంసాలతో మీడియాను బెదిరించలేరన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుందరరావు, మండల కార్యదర్శి చిట్టిబాబు, బొజ్జయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నరేష్, మత్సరాజు, కుమారి, సంధ్యారాణి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

న్యాయస్థానాలు కలుగజేసుకోవాలి

మాడుగుల: జర్నలిస్టులపై దాడులు పట్ల న్యాయస్థానాలు కలుగజేసుకోవాలని మాడుగుల తెలుగుదేశం పార్టీ కోరింది. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో గురువారం నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి పత్రికలు మూల స్తంభాలవంటివని, వీటిపై వైసిపి నాయకులు, కార్యకర్తలు చేస్తున్న దాడుల్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రసాదుల శ్రీనివాస్

ప్రజాశక్తి -గాజువాక : చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలుగుదేశం గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గాజువాక పార్టీ కార్యాలయంలో గురువారం విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన దుర్మార్గాలను, కుట్రలను, ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు, రూ.3000 నిరుద్యోగ భృతి, ప్రతి స్త్రీకి నెలకు రూ.1500, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు, ప్రతి ఇంటికీ ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఏటా రైతుకు రూ.20 వేలు ఆర్థిక సహాయం పథకాలను వివరించాలని కోరారు. ఈ మేనిఫెస్టోను చూసి వైసిపి నాయకుల గుండెల్లో ప్రకంపనలు మొదలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పులి వెంకటరమణారెడ్డి, కొవిరి హరికృష్ణ, బలగ బాలునాయుడు, మొలకపల్లి పెంటయ్య పాల్గొన్నారు.

సంస్థల మధ్య ఆరోగ్యకర పోటీకి ప్రత్యేక చట్టం

గీతంలో సిసిఐ డైరక్టర్ సుకేష్ మిశ్రా

ప్రజాశక్తి-మధురవాడ : వాణిజ్యరంగంలో ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వ కాంపిటిషన్ చట్టం-2002 ఉపయోగపడుతుందని కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా న్యాయ విభాగం డైరక్టర్ సుకేష్ మిశ్రా తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యాన గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పోటీ వాతావరణంలో సంస్థలు ఒకరిపైఒకరు ఆధిపత్యం సాధించడానికి అనైతిక మార్గాలను అనుసరించకుండా కాంపిటిషన్ చట్టం-2002 నిరోధిస్తుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన పోటీ తత్వం వల్ల వినియోగదారులకు సహితం ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ చట్టంలో తదినంతర కాలంలో వచ్చిన మార్పులను, ప్రస్తుత పరిస్థితులను ఆయన వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ డాక్టర్ అనితారావు మాట్లాడుతూ, చట్టానికి వ్యతిరేకంగా అనైతిక పోటీకి దిగే సంస్థలపై విచారణతో పాటు జరిమానా విధించడం ద్వారా కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గీతం ఎసిఎమ్ విభాగం సమావేశం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా గల అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మెషినరీ (ఎసిఎమ్) విద్యార్థి విభాగం ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ప్రముఖ డేటా సైన్స్ నిపుణుడు డాక్టర్ డి.సంతోష్‌కుమార్ ప్రసంగించారు. కృత్రిమ మేధ, డేటా సైన్స్, డేటా మైనింగ్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో సమూల మార్పులు తీసుకొస్తున్నాయని తెలిపారు. కృత్రిమ మేధ వంటివి వైద్య ఆరోగ్య రంగంలో నేడు విరివిగా ఉపయోగిస్తున్నారని చెప్పారు.

పార్వతమ్మను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి



పార్వతమ్మ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న పుణ్యవతి తదితరులు

ప్రజాశక్తి - అచ్యుతాపురం : సిపిఎం నాయకులు, మహిళా పోరాట యోధురాలు కీర్తిశేషులు కర్రి పార్వతమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మహిళలకు పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మరాజుపేట హెరిటేజ్ పాల కేంద్రంలో గురువారం జరిగిన పార్వతమ్మ ప్రథమ వర్ధంతి సభలో ఆమె చిత్రపటానికి పుణ్యవతి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పుణ్యవతి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాల్లోకి మహిళలను తీసుకొచ్చేందుకు పార్వతమ్మ ఎనలేని కృషి చేశారన్నారు. సారా వ్యతిరేక ఉద్యమం, ఆదర్శ వివాహాలు, నీటి సమస్యలు, రైతాంగ సమస్యలు తదితర వాటిపై ఆమె పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మహిళలు చదువుకోవాలని ఆమె చైతన్యపరిచేవారన్నారు. ఆమె లేని లోటు మహిళా ఉద్యమానికి, సిపిఎంకు తీరని లోటని పేర్కొన్నారు. నేటి ప్రభుత్వాలు ప్రజలను మతం, కులం పేరుతో విడగొడుతున్నారని, మహిళలపై లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు విపరీతంగా పెరిగాయని తెలిపారు. వీటి వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మరాజుపేట సర్పంచ్ సరగడం భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ కె.రాము, టిడిపి నాయకులు శరగడం శివబాబునాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కాండ్రేగుల రామసదాశివరావు, సిపిఎం నాయకులు శరగడం రామునాయుడు, బుద్ధ రంగారావు, ఆర్.రాము డావిన్సీ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకులు కర్రి సుందరయ్య, ఐద్వా మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి, నాయకులు కర్రి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యాన గ్రూప్ 2 మోడల్ పరీక్ష


మోడల్ పరీక్ష రాస్తున్న గ్రూప్ 2 అభ్యర్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రూపు - 2 మోడల్ పరీక్షను అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించారు. పరీక్ష పేపర్‌ను విజ్ఞాన కేంద్రం బాధ్యులు విఎస్.పద్మనాభరాజు విడుదల చేశారు. డివైఎఫ్ఐ పూర్వ నాయకులు ఎస్.పుణ్యవతి మోడల్ పరీక్ష విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువజన సంఘం ఈ విధంగా పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాన పరీక్షలో మంచి ఫలితాలు సాధించి ఉద్యోగాలు సంపాదించాలన్నారు.

సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ నిరుద్యోగుల సమస్యలపైన నిరంతరం పోరాడుతోందన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించి సాధించిందని తెలిపారు. ఉద్యమాలే కాకుండా అభ్యర్థులకు సహాయ పడాలన్న ఉద్దేశంతో గ్రూప్ 2 మోడల్ పరీక్ష నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కోటి, అక్బర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ద్వంద్వ వైఖరి విడనాడాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం ద్వంద్వ వైఖరి విడనాడాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని ఎపి జెఎసి ఆధ్వర్యంలో తాలూకా, జిల్లా స్థాయిల్లో ధర్నాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 27న చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం ఉన్న సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను చర్చలకు పిలిచిందని తెలిపారు. ఇలా ఒక పక్క చర్చలకు ఆహ్వానిస్తూనే చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉక్కుపాదంతో అణచి వేయడానికి ముందస్తు అరెస్టులకు పాల్పడుతోందని పేర్కొన్నారు. ఎక్కడికక్కడ పోలీసులు ముందస్తు నోటీసులు ఇస్తున్నట్టు తెలిపారు.

నేరాలు ఘోరాలు

4,150 లీటర్ల సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని ఆంధ్ర- ఒడిశా బోర్డర్ వసబంధ ,సిమిలిగూడ గ్రామాల్లో స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మొబైల్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 4150 లీటర్ల నాటు సారా పులుపును, 40 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు.

150 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-అరకులోయ: ఒడిశా రాష్ట్రం నుంచి అరకు మీదుగా ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయి 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు అరకులోయ సీఐ రుద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అరకులోయ మండల కేంద్రంలో నివాసముంటున్న లోతేరు గ్రామానికి చెందిన పాంగి శ్యామ్ గణేష్, తురాయి గూడ గ్రామానికి చెందిన కొర్ర కోటేశ్వరరావు, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రాంబాబు అలియాస్ యాదవ్, బితేంద్రలు ఒరిస్సా రాష్ట్రంలో కిలో గంజాయి 2 వేల చొప్పున కొనుగోలు చేసి మధ్యప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సుంకరమెట్టలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు ఆయన తెలిపారు. లారీలో తరలిస్తున్న 100 కేజీల, కారులో తరలిస్తున్న 50 కేజీల గంజయిను వీరి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. దీని విలువ సుమారుగా రూ.3 లక్షల వరకు ఉండవచ్చన్నారు. ఈ సమావేశంలో అరకులోయ ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధునికి గాయాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన విసరపు అప్పారావు నక్కపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు వచ్చి తిరిగి వెళుతుండగా తుని వైపు నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పారావు తీవ్రంగా గాయపడటంతో స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్సను అందించారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏటిగైరంపేట వద్ద గురువారం ఆర్టీసి బస్సు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్తున్న ఆర్టీసి బస్సు ఏటిగైరంపేట వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కొయ్యూరు మండలం గుమ్మడివానిపాలెం గ్రామానికి చెందిన కాకర సంజీవరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో శిక్షణ

ప్రజాశక్తి -ములగాడ : ఎదురువాణిపాలెం గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌజన్యంతో ఇక్క లెర్నింగ్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో సుమారు 30 మంది మహిళలకు జ్యూట్ బాగ్స్ తయారీలో శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ శిక్షణ తరగతులను సంస్థ హెచ్‌ఆర్ డిజిఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు నాగార్జున, ఎస్.వెంకటరమణ, గ్రామ పెద్దలు ఎదురు అప్పలస్వామి, ఎదురు రాజు, తోనంగి వెంకటరమణి తదితరులు పాల్గొన్నారు.


శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

సబ్సిడీపై పిండి మిల్లు పంపిణీ

ప్రజాశక్తి - అనంతగిరి : మండలంలో సబ్సిడీపై పిండి మిల్లులు మంజూరు కాగా వాటిని పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారి ఎ.ఉమామహేశ్వరి తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ సభ్యులు గంగరాజు, స్థానిక సర్పంచ్ రూతు, ఎగువ శోభ సర్పంచ్ కొర్రా. సింహాద్రి ఆధ్వర్యంలో పిండి మిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో ఐదుగురికి పిండి మిల్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, సుమారు 50 శాతం సబ్సిడీపై పిండి మిల్లులు అందిస్తున్నారన్నారు. క్రషర్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్ కావలసిన వారు వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఉమామహేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో టోకూరు మాజీ సర్పంచ్ సార దొన్ను, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు దీపిక, గీత, జోతి పాల్గొన్నారు.

వైసిపి పాలనపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర ప్రజలకు గంజి అన్నమే దక్కుతుందని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి అన్నారు. గురువారం టిడిపి కార్యాలయ ఆవరణలో 'జగన్‌ను మేము ఎందుకు నమ్మాలి' ఫ్లెక్సీ పెట్టి, దాని ఎదుట గంజి అన్నం తింటూ నిరసన తెలిపారు.

లక్ష్మికి ఘన సత్కారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టి.లక్ష్మి స్వీపర్‌గా సుమారు 32 ఏళ్ళు పాటు పనిచేస్తూ గురువారం పదవి విరమణ చేశారు. దీంతో, ఆమెకు స్థానిక వైద్యాధికారులు పి రాంబాబు, అంబికతో పాటు వైద్య సిబ్బంది సాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ, విధి నిర్వహణలో లక్ష్మి ఎంతో మంది వ్యాధిగ్రస్తులకు సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టించి పనిచేయాలి

ప్రజాశక్తి - అరకులోయ : ప్రతి కార్యకర్త కష్టించి పని చేసి పార్టీని గెలిపించాలని అరకు నియోజకవర్గం వైసిపి పరిశీలకురాలు శోభ హైమావతి దేవి పిలుపు పిలుపునిచ్చారు. స్థానిక వి రిసార్ట్స్‌లో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైసిపి పట్ల ప్రజాదరణ ఉందని, గతంలో కంటే గిరిజన గ్రామాల్లో అన్ని పథకాలు అందుతున్నాయని తెలిపారు. గవర్నర్ కోట ఎమ్మెల్సీ కుంభ రవి బాబు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో పార్టీ పటిష్టంగా ఉందని, మరోసారి గెలిపించి ముఖ్యమంత్రి జగన్ కు గిఫ్టుగా ఇవ్వాలని ఆయన అన్నారు. అరకు నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్య లింగం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ సుభద్ర, అరకు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సాగు భూములకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన సాగు భూములకు, సాగులో ఉన్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని నాయకులు, సాగుదారులు కోరారు. మండలంలోని అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామంలో గురువారం వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూసేకరణ గ్రామాల్లో సేకరించిన భూములకు సంబంధించి పెండింగ్ పేమెంట్లు, సమస్యలను తెలుసుకునేందుకు రెవెన్యూ,ఏపీఐఐసీ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ మేరకు దోనివాని లక్ష్మిపురం, మూలపర్ర, పాటి మీద గ్రామాల్లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం అందజేసారు. అనేక సంవత్సరాలుగా పేదలు సాగు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, పరిశ్రమల స్థాపన కోసం సాగు భూములను ప్రభుత్వం సేకరించడంతో సాగుదారులు జీవనోపాధి కోల్పోవడం జరుగుతుందని తెలిపారు. . ఈ కార్యక్రమంలో అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకర్రావు, వైస్ సర్పంచ్ గంటా నర్సింగరావు, దోనివాని లక్ష్మి పురం మాజీ ఎంపిటిసి గింజాల వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిరసన

ప్రజాశక్తి- అనంతగిరి: తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మండలంలోని మారుమూల పిన్నకోట పంచాయతీ పరిధి రాచకిలం గ్రామంలో మహిళలు ఖాళీ బిందెలతో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సూకురు దేముడమ్మ, సూకురు వరహలమ్మ మాట్లాడుతూ, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు 2022 సంవత్సరంలో 7.50 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా అధికారులు పనులు అసంపూర్తిగా చేపట్టి వదిలేశారని విమర్శించారు.